



దిగ్గజాలు దిగివచ్చారు. ధార్మికవేత్తలు ఏతెంచారు. సంప్రదాయ వాయిద్యాలు హోరెత్తాయి. వేడుకగా అంతర్జాతీయ ఆలయాల సదస్సు ఉత్సవంలా మొదలైంది. ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో- 2025 సందడితో తిరుపతి కళకళలాడింది. సోమవారం సాయంత్రం ప్రారంభ వేడుకకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆరెస్సెస్ ప్రముఖులు, దేశంలోని ప్రసిద్ధ ఆలయాల నిర్వాహకులు, వివిధ రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఆశా కన్వెన్షన్‌లో మరో రెండు రోజుల పాటూ ఈ సదస్సులు కొనసాగుతాయి. సదస్సుకు అనుబంధంగా జరుగుతున్న ఆలయాల భద్రత, నిర్వహణకు ఉపకరించే పరికరాలు, భారతీయ సంప్రదాయ వస్త్ర, చిత్రాల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.









ఆలయోత్సవం

తిరుపతిలో వేడుకగా ప్రారంభం


ముగ్గురు సీఎంలు, ఐదుగురు మంత్రులు, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు, వీహెచ్‌పీ ప్రముఖులు,ఆధ్యాత్మిక వక్తలు,ఆలయ ట్రస్టీలు, అధికారులు, నిపుణులు.. ఒక చోట కలిశారు. ఇంతమంది ప్రముఖులు హాజరవుతున్న సదస్సు గురించి ఒక రోజు ముందుగానే జిల్లావాసులకు తెలిసింది.ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్-2025)పేరిట టెంపుల్ కనెక్ట్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఆలయోత్సవానికి తిరుపతిలోని ఆశా కన్వెన్షన్ సెంటర్ వేదికైంది. అంతమంది ప్రముఖులు హాజరయ్యే చోటకు వెళ్లాలని పలువురు ఆసక్తి చూపినప్పటికీ భద్రతాకారణాల నేపథ్యంలో అనుమతి దొరకలేదు.సోమవారం నాటి ప్రారంభ సభకు ముందు అతిథులకు స్వాగతం పలుకుతూ ముంబై నుంచి వచ్చిన సంప్రదాయ కళాకారుల ఆధ్యాత్మిక సంగీత విన్యాసాలు ఓ పవిత్ర వాతావరణం లోకి తీసుకెళ్లాయి. ఒక హాల్లో సభ, మరో హాల్లో వివిధ స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఆలయ పరిశుభ్రత, భద్రత, ఆచార వ్యవహారాలకు సంబంధించిన వస్తువులను తయారుచేసే కంపెనీలు ఈ స్టాళ్లలో కనిపించాయి. 17 దేశాల్లోని 1581 దేవాలయాల నుంచి ప్రతినిధులు సదస్సులో భాగస్వామ్యం కానున్నట్టు నిర్వాహకులు చెప్పారు. అయితే 58 దేశాల నుంచి అదనంగా 685 దేవాలయాల ప్రతినిధులు హైబ్రిడ్ ఫార్మాట్‌లో పాల్గొంటారని చెప్పారు.11మందికి పైగా వక్తలు, 15 వర్క్‌షాప్‌లు, 60 ఎగ్జిబిషన్ స్టాల్స్ అంతర్జాతీయ దేవాలయాల సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

శ్రీ వేంకటేశ్వర ఆలయానికి నిలయంగా ఉన్న తిరుపతి ఏటా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తోందని, ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత రద్దీగా ఉండే మతపరమైన ప్రదేశాలలో ఒకటిగా మారుతోందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అందరి నోటా శ్రీవారి ప్రశస్తి

తిరుపతి, తిరుమల ప్రశస్తి, శ్రీవారి వైభవం ఎవరికీ తెలియంది కాదు. తరతరాలుగా తిరుమల, తిరుపతి పుణ్యక్షేత్రాలను, శ్రీవారిని ఎందరో రాజులు, చక్రవర్తులు దర్శించడం, శ్లాఘించడం, విలువైన కానుకలు సమర్పించడమూ కొత్త కాదు. అయినా నేటికీ తిరుపతి వేదికగా ఏ కార్యక్రమం జరిగినా, ఏ ప్రముఖులు పాల్గొని ప్రసంగించినా అందులో తిరుపతి పుణ్యక్షేత్ర ప్రస్తావన, శ్రీవారి వైభవాన్ని ప్రస్తుతించకపోవడమనేది ఉండదంటే అతిశయోక్తి కాదు. సోమవారం సాయంత్రం తిరుపతిలో ప్రారంభమైన ఐటీసీఎక్స్-2025 సదస్సులోనూ అదే ప్రతిబింబించింది. పలువురు వక్తల నోట తిరుపతి పుణ్యక్షేత్రం, తిరుమల శ్రీవారి ప్రశస్తి పలుమార్లు ప్రస్తావనకు వచ్చింది. ఐటీసీఎక్స్ సదస్సుకు తిరుపతి వేదిక కావడం, అందులో పాల్గొనడం తమ అదృష్టమన్న మాటలతోనే ముగ్గురు సీఎంలూ ప్రసంగాలు ప్రారంభించారు.







దేవుడిని పూజించే ప్రతి భక్తుడికీ సహజ సిద్ధమైన గమ్యస్థానంగా తిరుపతి ఆవిర్భవించింది. తిరుమలలో భక్తులకు అన్న ప్రసాదాలు అందించాలనే ఉద్దేశంతో 1985-86లో అప్పటి సీఎం ఎన్టీఆర్ శ్రీవారి అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేశారు. ఇపుడా ట్రస్టుకు విరాళాల రూపంలో రూ.3 వేల కోట్లు కార్పస్ ఫండ్ చేరింది. దీనిపై వచ్చే వడ్డీతో తిరుమల, తిరుపతిల్లో టీటీడీ భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేస్తోంది. నేను సీఎంగా గతంలో ప్రారంభించిన శ్రీవారి ప్రాణదాన ట్రస్టుకు ఇపుడు రూ.440 కోట్లు వచ్చాయి. ఆ నిధులతో టీటీడీ ఎందరికో ప్రాణదానం చేస్తోంది. అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ.. హిందువులున్న ప్రతిదేశంలోనూ శ్రీవారి ఆలయాలు ఉండాలి. తిరుమలలో 75 శాతం గ్రీన్ కవర్ ఉంది. అక్కడ పర్యావరణాన్ని కాపాడేందుకు మరింత పెద్దఎత్తున చర్యలు తీసుకుంటాం. తిరుపతిలో ఐటీసీఎక్స్ నిర్వహిస్తున్న రెండో సదస్సుకు వచ్చిన ముఖ్యులకు శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ ఈవోకు చెబుతున్నా.

- ఏపీ సీఎం చంద్రబాబు

58 దేశాల నుంచీ 1500 ఆలయాల నిర్వహణా కమిటీలు పావన నగరమైన తిరుపతిలో సదస్సు చేపట్టడం అద్భుతం. దీనికి నన్ను ఆహ్వానించడం, శ్రీవారి దర్శనం చేసుకుని సదస్సులో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. దేశంలో ఆలయ నిర్వహణ అద్భుతంగా అమలవుతున్నది తిరుమల, తిరుపతి దేవస్థానాలలోనే. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, నాగలాపురం వంటి చోట్ల ఆలయాల నిర్మాణానికి, అభివృద్ధికి శక్తిమేరా విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు పాటుపడ్డారు. దక్షిణ భారతాన అద్భుత ఆలయాలు కట్టించారు.

- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

ప్రయాగరాజ్‌లో మహాకుంభ్ జరుగుతుంటే.. తిరుపతిలో ఆలయాల కుంభ్ మేళా జరుగుతోంది. ఇందులో పాల్గొనడం అదృష్టంగానే కాక గర్వంగా భావిస్తున్నా.

- గోవా సీఎం ప్రమోద్ సావంత్

ముగ్గురు సీఎంల పర్యటన ప్రశాంతం



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, ప్రమోద్‌సావంత్ తదితర ప్రముఖుల తిరుపతి పర్యటన ప్రశాంతంగా సాగింది.ఆశా కన్వెన్షన్ హాలు వద్ద పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. వేదిక చుట్టూ పారా మిలటరీ బలగాలను నియమించారు. మంగళం- తిరుపతి రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, దాదాపు 800 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. సభాస్థలికి వెళ్లే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించారు. బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు అడుగడుగునా తనిఖీలు చేశాయి. రోడ్డులో వెళుతున్న కొందరు అనుమానితులను ముందస్తుగా తనిఖీలు చేసి అదుపులోకి తీసుకుని వదలి పెట్టారు.


సదస్సులో నేడు..

విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ మాజీ ఛైర్మన్ సురేష్ హవారే, గోవా పర్యాటక మంత్రి రోహన్, ఇస్కాన్ కమ్యునికేషన్స్ డైరెక్టర్ గోవింద దాస్ తదితరులు పలు అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొననున్నారు.

హంద్రీ-నీవా కాలువ విస్తరణ

పనులు వేగవంతం

- సమాంతరంగా చేపట్టిన సైడ్‌వాల్స్ కాంక్రీటు పనులు



రాజుపేట వద్ద సైడ్‌వాల్స్ కాంక్రీటు పనులు

రామకుప్పం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి(హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ విస్తరణ పనులు రామకుప్పం మండలం వర్దికుప్పం, రాజుపేట వద్ద చకచకా సాగుతున్నాయి.దీంతో 2014 నుంచి హంద్రీ-నీవా జలాల కోసం ఎదురు చూస్తున్న కుప్పం ప్రజల నిరీక్షణకు తెరపడే రోజు దగ్గరలోనే ఉన్నట్టు కన్పిస్తోంది.2014లో టీడీపీ ప్రభుత్వం హంద్రీ-నీవా కుప్పం కెనాల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8మండలాల్లో 110చెరువులకు నీరు చేరి, వాటి కింద ఉన్న 6300ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమయ్యేలా 123 కిలోమీటర్ల మేర కాలువ ఏర్పాటుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.575కోట్లు మంజూరు చేసింది. 2019 ఎన్నికలకు ముందే కుప్పం కెనాల్ పనులు 90శాతం పూర్తి చేయించింది. 2019 ఎన్నికల్లో గెలిచిన వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేశాక మిగిలిన 10శాతం పనులు చేపట్టకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఎన్నికలకు ముందు ఎక్కడో నీటికి అడ్డుకట్ట వేసి, ఆ నీటిని కుప్పానికి అందిస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం హడావిడి చేసింది. రామకుప్పం మండలం రాజుపేట వద్ద సినీఫక్కీలో గేటు ఏర్పాటు చేసి స్వయంగా అప్పటి సీఎం జగన్ బటన్ నొక్కారు. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఆ జలాలు శాంతిపురం మండలానికి కూడా చేరుకోలేదు. రామకుప్పం దాకా వచ్చిన ఆ జలాలు ఎక్కడి నుంచి తరలించారో కూడా అప్పటి పాలకులు, అధికారులు వెల్లడించకపోవడం గమనార్హం.గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘనవిజయం సాధించి, సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడంతో హంద్రీ-నీవా పనుల్లో కదలిక ఏర్పడింది. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు రెండోసారి కుప్పం పర్యటనకు వచ్చినప్పుడు హంద్రీ-నీవా కాలువల దుస్థితిని పరిశీలించారు. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను జూన్ నెల లోపు పూర్తి చేసి, కుప్పం నియోజకవర్గానికి జలాలు తీసుకువస్తామని ఆయన ప్రకటించారు. అదేవిధంగా హంద్రీ-నీవా జలాలను పాలారు నదికి తీసుకురావడమే కాకుండా,ఆ నదిపై మరిన్ని చెక్ డ్యాంలు నిర్మిస్తామని తెలిపారు. జలాలు భూమిలో ఇంకకుండా, వృథా కాకుండా, వేగంగా గమ్యస్థానానికి తీసుకెళ్ళేలా పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2024 డిసెంబరులో పలమనేరు-కుప్పం బ్రాంచ్ కెనాల్ వెడల్పు, లైనింగ్ పనులకు రూ.97.7కోట్లు మంజూరు చేశారు.దీంతో నెల రోజులుగా వర్దికుప్పం, రాజుపేట వద్ద కాలువ వెడల్పు, జలాలు భూమిలోకి ఇంకకుండా కింద సీసీ బెడ్డింగ్, దానిని అనుసంధానిస్తూ కాలువ ఇరువైపులా పక్క గోడలకు సీసీ లైనింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం రాజుపేట వద్ద ఓ వైపు కాలువ విస్తరణ పనులు, మరో వైపు బెడ్డింగ్, లైనింగ్ పనులు చకచకా సాగుతున్నాయి. అంతేకాకుండా తంబళ్ళపల్లె నుంచి మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం వరకు 225.35 కిలోమీటర్ల మేర కాలువ విస్తరణకు ప్రభుత్వం గత అక్టోబరులో రూ.348కోట్లు మంజూరు చేసింది. గత సెప్టెంబరు 26న పెద్దతిప్పసముద్రం మండలం దొరిగుండ్లపల్లె వద్ద కాలువ విస్తరణ పనులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు.ఎక్కడి కక్కడ కాలువ విస్తరణ పనులు చురుగ్గా సాగుతుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులు

అంగన్వాడీల్లో కలకలం

నిరసనకు రాకుంటే తనిఖీలు తప్పవంటూ యూనియన్ నాయకురాలి హెచ్చరిక

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీల నిరసన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలంటూ యూనియన్ నాయకురాలొకరు బెదిరింపులకు దిగడం చర్చనీయాంశమైంది. వేతనాల పెంపుతో పాటు అనేక డిమాండ్లతో సీఐటీయూ అనుబంధ సంస్థ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సోమవారం కార్వేటినగరంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ కార్యక్రమానికి కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం మండలాల్లోని మెయిన్ అంగన్వాడీ సెంటర్ల వర్కర్లు తప్పనిసరిగా హాజరు కావాలని,లేకుంటే వారు పనిచేస్తున్న సెంటర్లకు విస్తృత తనిఖీలు తప్పవని హెచ్చరిస్తూ యూనియన్ నాయకురాలు ఒకరు సోషల్ మీడియా, స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో విడుదల చేసిన ఆడియో సందేశం కలకలం రేపింది.ఇలా ఆదేశాలివ్వడం ఏంటని కొందరు అంగన్వాడీలు వెంటనే సీడీపీవోకు, ఇతర అధికారులకు ఆ ఆడియోలను పంపించారు.ఇదే విషయాన్ని సీడీపీవో పద్మసునంద వద్ద ప్రస్తావించగా ఆడియో సందేశం తన దృష్టికి వచ్చిందన్నారు.

పాఠశాల ఆవరణలో దేవాంగపిల్లి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని డాన్ బోస్కో పాఠశాల ఆవరణలో సోమవారం ఓ దేవాంగపిల్లి ప్రత్యక్షమైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కిరణ్ కిషోర్ పాఠశాలకు చేరుకున్నారని తెలిపారు. దేవాంగపిల్లిని స్వాధీనం చేసుకుని అటవీప్రాంతంలో వదిలివేసినట్లు చెప్పారు.



మహారాష్ట్ర సీఎంను కలిసిన టీటీడీ ఈవో



శ్రీవారి దర్శనం కోసం వచ్చిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను సోమవారం టీటీడీ ఈవో శ్యామలరావు తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణంపై దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చించారు. ఆలయ నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయి త్వరతగతిన నిర్మాణం జరిగేందుకు సహకరించాలని ఈవో కోరగా, మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సౌరభ్ హెచ్‌బోరా పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.20 లక్షలు విరాళంగా అందాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వెంకటరమణ రూ.10 లక్షలు, తిరుపతికి చెందిన సాధు పృథ్వీ రూ.10 లక్షలు చొప్పున విరాళం డీడీలను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న సాధు పృథ్వీ


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793





ఇక్కడ అడుగు పెట్టగానే కాశీ విశ్వేశ్వరుడే కాదు సకల దేవతామూర్తులూ దర్శనమిస్తారు. అందుకే దక్షిణ కాశీగా భక్తుల మనసులో ఆధ్యాత్మిక ముద్ర వేసుకుంది.. నగరి మండలం బుగ్గఅగ్రహారంలోని అన్నపూర్ణసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం శతాబ్దాలుగా ఇతిహాస,చరిత్రలకు సాక్షిగా నిలుస్తోంది. ఈ దివ్యధామం గురించి తెలుసుకుంటే...

- నగరి, ఆంధ్రజ్యోతి

బుగ్గ అగ్రహారం భూకైలాసం

కొలువు దీరిన కాశీ విశ్వేశ్వరుడు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గోపురం - దోనె నుంచి తీర్థం నీరు

సప్త రుషుల్లో ఒకరైన గౌతమి మహర్షి దేశసంచారంలో భాగంగా బుగ్గ అగ్రహారం వద్ద సేదతీరారని ఇతిహాసగాథ ప్రచారంలో ఉంది. గంగా తీరాన కాశీఆలయం తరహాలోనే ఇక్కడి కుశస్థలీ నది ఒడ్డున వాతావరణం పోలి ఉన్నట్టు ఆయన గుర్తించారు.



ఆలయ ముఖద్వారం

దక్షిణభాగంలోనూ ఇది కాశీగా భాసిల్లుతుందని భావిచారట. పాండవులు వనవాస సమయాన ఈ ప్రాంతంలో సంచరించి కాశీని తలపించే దేవతా విగ్రహాలు ఇక్కడ ఉండటాన్ని గమనించారని చెబుతారు. ఆక్రమంలోనే నీటి కోసం కాశీ, గుహ, భవాని, పుణీకర్ణిక, అయ్యవున అనే దోనెలను సృష్టించారంటారు. శివభక్తులైన చోళరాజులు ఇక్కడి విశిష్టత గుర్తించి క్రీ.శ. 1562లో అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ప్రస్తుత ఆలయ ప్రధానార్చకుడు కుప్పయ్యస్వామి తెలిపారు.

ఆలయాల ఆధ్యాత్మిక మాల

బుగ్గ దేవాలయ ప్రాంగణంలో సకల దేవతల ఆలయాలూ ఉన్నాయి. విశ్వేశ్వరుడు, కామాక్షిదేవి, అన్నపూర్ణదేవి, భూనీలాదేవి సమేత ప్రయాగ మాధవస్వామి, కాలభైరవస్వామి, దొంటిగణపతి, సద్యోజాత మూర్తి, వాసుదేవమూర్తి, అఘోర మూర్తి, వల్లిదేవయాని సమేత సుబ్రమణ్యస్వామి, భక్తకన్నప్ప, దుర్గాదేవి, తత్పురుష మూర్తి, వీరభద్రస్వామి, మహిషాసురమర్దిని, సూర్యనారాయణస్వామి, భక్తాంజనేయస్వామిలు భక్తుల నుంచి పూజలందుకుంటున్నారు.

30ఏళ్లుగా టీటీడీ నిర్వహణ



ఆలయ ప్రాంగణంలో చిన్న దేవాలయాలు

చోళరాజులు, కార్వేటినగరం రాజుల తర్వాత తిరుపతి ఆలయ మహంతులు ఈ ఆలయాన్ని పర్యవేక్షించారు. 1980లో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 1994 నుంచి నిర్వహణ బాధ్యతను తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకుంది. శివుడితోపాటు పలు దేవుళ్ల విగ్రహాలు ఉండటంతో శివరాత్రి మాత్రమే కాదు ఏటా ఏకాదశి, వినాయకచవితి, ఆడికృత్తిక, సంక్రాంతి, విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అయితే వేసవి తీవ్రత నేపథ్యంలో గతేడాది అక్టోబరులో నవరాత్రి ఉత్సవాలలో రెండు దోనెల్లో మాత్రమే నీరు ప్రవహించిది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఈ నీటితో స్నానమాచరించారు. ఈఏడాది శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రివరకూ ప్రసాద వితరణ ఉంటుందని అర్చకులు తెలిపారు.







డ్రోన్‌ల నుంచి కీచైన్‌ల దాకా..

● ఆకట్టుకుంటున్న టెంపుల్ ఎక్స్‌పో

తిరుపతిలో సోమవారం మొదలైన మూడురోజుల ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025 (ఐటీసీఎక్స్‌)లో ఏర్పాటుచేసిన పలు రకాల స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యద్వారా వద్ద బంగారుపూతతో మినీ ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఆలయాల నిర్వహణలో ఉపకరించే ఆధునిక పరికరాలు, భద్రతకు ఉపయోగపడే ఎలక్ట్రానిక్ పరికరాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయి. భారతీయ సంప్రదాయ చేనేత వస్త్రాలు, జానపద సంప్రదాయ చిత్రాలు కూడా ఉఆన్నయి. డ్రోన్‌లు, ఫ్లయింగ్ కెమెరాలు, సీసీ కెమెరాలు, టూవీలర్లూ, కార్లకు క్విక్ చార్జింగ్ యంత్రాలు, మూవింగ్ ఎల్‌ఈడీ స్క్రీన్స్ ఈ ప్రదర్శనలో ఆకర్షిస్తున్నాయి.

మిరుమిట్లు గొలిపే కలర్‌ఫుల్ ఎల్‌ఈడీ లైట్లు, డిజిటల్ లాకర్స్ మొదలు ఆటోమేటిక్ క్లీనింగ్ యంత్రాల దాకా ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి.


- తిరుపతి అర్బన్,ఆంధ్రజ్యోతి













పీజీఆర్‌ఎస్‌కు 238 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 వినతులు వచ్చాయి. అందులో ప్రధానంగా భూ సమస్యలపై 161 అర్జీలు ఉన్నాయి. జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు వినతులు స్వీకరించారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..!

అగ్ని ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితికి చేరుకున్నాను. ఎన్నో ఏళ్లుగా వస్తున్న పింఛన్‌ను రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. కరుణించి పింఛను పునరుద్ధరించండి.



- గురుస్వామి, దివ్యాంగుడు, జీవకోన

గ్రామానికి రోడ్డు వేయండి



30 ఏళ్లుగా గ్రామానికి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని, కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా లాభం లేకపోయిందని వడమాలపేట మండలం వడమాల దళితవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు.

రోడ్డు కోసం ఆందోళన చేస్తున్న వడమాల దళితవాడవాసులు

తిరుమలలో వేసవి ఉపశమన చర్యలు



వేసవి రాకముందే తిరుమలలో ఎండ మండుతోంది. వారం రోజులుగా చెప్పులు లేకుండా నడవటం ఇబ్బందిగా మారింది. పరిస్థితిని గుర్తించిన టీటీడీ అధికారులు తక్షణ చర్యలను ప్రారంభించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటితో నేల భాగాన్ని చల్లబరుస్తున్నారు. రానున్న వారం రోజుల్లో పలు ప్రదేశాల్లో చలువ పందిళ్ల వేయనున్నారు. అవసరమైన చోట కూల్ పెయింట్ వేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై అవగాహన

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సొంతంగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చేపట్టనుండడంతో సోమవారం అధికార యంత్రాంగానికి అవగాహన కల్పించారు. అలిపిరి డిపో కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన వీఎన్‌ఆర్ అండ్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ అండ్ రీసెర్చ్ ప్రతినిధి అస్లామ్ అన్సారి, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు అంజర్‌ఖార్, రమేష్, హరీష్ హాజరై విద్యుత్ బస్సుల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, అనుకూలతలు, మెరుగైన నిర్వహణ వంటి అంశాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒకే దఫాలో రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు తెలుస్తోంది. ఈ సదస్సులో డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎంలు బాలాజీ, హరిబాబు, భాస్కర్, పుష్పలత, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్వీయూను సందర్శించిన యూఎస్‌ఏ ప్రతినిధి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన పార్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధి జూలియానా కస్సవన్ సోమవారం ఎస్వీ యూనివర్సిటీని సందర్శించారు. గతంలో ఎస్వీయూతో పార్డ్యూ వర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఈ రెండు వర్సిటీలు పరస్పరం సహకరించుకోనున్నాయి. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించిన జూలియానా కస్సవన్‌ను ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాద రాజు సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు విజయలక్ష్మి, అపర్ణ, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.



జూలియానా కస్సవన్‌ను సత్కరిస్తున్న దేవప్రసాదరాజు

టీటీడీ చైర్మన్ ఫొటో డీపీగా పెట్టుకుని..

● ఎన్‌ఆర్‌ఐలను మోసగిస్తున్న కేటుగాడు



తిరుమల సమాచారంతో పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి ఫొటోను వాట్సాప్ ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకుని ఎన్‌ఆర్‌ఐ భక్తులను మోసగిస్తున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. మోసపోయిన కొందరు భక్తులు ఇటీవల టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెల్లడైంది. హైదరాబాద్‌లోని ఓల్డ్‌సిటీకి చెందిన మహ్మద్ జావెద్ ఖాన్ 'తిరుమల సమాచారం' పేరుతో ఓ వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని గ్రూప్‌లో పోస్ట్ చేస్తూ అందిన వరకు దోచుకుంటున్నాడని విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీ విజిలెన్స్, పోలీసులను చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్, - కాశీ మఠాధిపతి సమ్యమేంద్రతీర్థ.







మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి - ఇండియన్ నేవీ మాజీ అధికారి హరి ఓం సింగ్ రాణా - యాంకర్ గీతా భారతి

సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం

● మోపూరు అటవీ భూముల్లో 144, 145 సెక్షన్లు ● ఆక్రమణదారులు రాకుండా పోలీసుల పహారా

డక్కిలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని మోపూరు సర్వే నెంబరు 1లో ఉన్న అటవీశాఖ భూమి సెంటు కూడా అన్యాక్రాంతం కానివ్వబోమని వెంకటగిరి రేంజ్ ఆఫీసర్ లోకేశ్ స్పష్టం చేశారు. సోమవారం అటవీ భూముల ఆక్రమణ జరుగుతుందని సమాచారం అందడంతో ఆ శాఖ అధికారులతో పాటు పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. సదరు భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించరాదంటూ పోలీసులు 144 సెక్షన్, అటవీశాఖ అధికారులు 145 సెక్షన్ విధించారు. ఈ సందర్భంగా రేంజర్ లోకేశ్ మాట్లాడుతూ గిరిజన సంఘ నాయకులు కొంతమంది స్థానికులను రెచ్చగొట్టి అటవీ భూముల ఆక్రమణను ప్రోత్సహించడం సరికాదన్నారు. రిజర్వు ఫారెస్టు భూములను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని గుర్తుచేశారు. కొంతమంది అటవీ భూమును తాము సాగు చేస్తున్నట్లు హైకోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. 145 సెక్షన్ మూడు నెలలు పాటు అమల్లో ఉంటుందన్నారు. మోపూరు భూములను గూడూరు డీఎస్పీ గీతా కుమారి పరిశీలించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని చర్యలు తీసుకోవాలని వెంకటగిరి సీఐ వెంకటరమణకు తగు సూచనలు ఇచ్చారు.



మోపూరు భూముల్లో అటవీశాఖ, పోలీసు అధికారులు

'పీజీఆర్ఎస్'కు అర్జీల వెల్లువ




నగరి ఆటో డ్రైవర్ల ధర్నా - కలెక్టరేట్‌కు వచ్చిన బీజేపీ నేతలు



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, తదితరులు

'విశ్వకర్మ' శిక్షణార్థులకు ష్యూరిటీ లేకుండా రుణాలివ్వాలని బీజేపీ విజ్ఞప్తి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ యోజన కింద శిక్షణ పొందినవారికి ష్యూరిటీ లేకుండా బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి జిల్లా కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 248 అర్జీలు అందాయి. వీటిల్లో రెవెన్యూకు 202, డీఆర్‌డీఏకు 21, డ్వామాకు 6, పోలీసుశాఖకు 4, డీసీహెచ్ఎస్‌కు 3, పంచాయతీరాజ్‌కు 2 ఉండగా, కాలుష్య నివారణ సంస్థ, పెద్ద పంజాణీ, తవణంపల్లె ఎంపీడీవోలకు, నగరి మున్సిపాలిటీకి, గృహ నిర్మాణ సంస్థలకు కలిపి 10 అర్జీలు ఉన్నాయి. కలెక్టరేట్‌లో బాధితుల నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, ఇతర అధికారులు అర్జీలను స్వీకరించారు.

ప్రధాన అర్జీల్లో కొన్ని..

- నగరి మున్సిపల్ పరిధిలో ఒక్కో ఆటోకు రూ.30 చొప్పున గేటు వసూలు చేయడాన్ని ఆపాలని డ్రైవర్లు కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఈ మేరకు ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. నగరి ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.
- ఐరాల మండలం పొలకల అగ్రహారంలో బస్ షెల్టర్ లేక విద్యార్థులు, స్థానికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు.
- డ్వాక్రా సంఘ సమావేశాలు నిర్వహించుకోవడం కోసం కమ్యూనిటీ హాలు నిర్మించాలని తవణంపల్లె మండలం దిగువ మోదలపల్లె, మాదిగపల్లె గ్రామస్తులు కోరారు.
- సర్వే నెంబరు 417-4లో 1.05 ఎకరాల భూమిని తనకు పుట్టింటివారు పసుపుకుంకుమ కింద ఇచ్చారని కార్వేటినగరం మండలం కేశవకుప్పం ఎస్టీకాలనీకి చెందిన సుబ్బమ్మ తెలిపారు. దీనికి సంబంధించిన పట్టాదార్ పాసుపుస్తకం కూడా ఉందన్నారు. ప్రస్తుతం ఈ భూమిని డబ్బులు తీసుకుని వేరే వ్యక్తికి వీఆర్వో రాసిచ్చాడని ఆరోపించారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.
- జీతాలు అడిగిన పాపానికి సర్పంచ్ తమను విధుల నుంచి తొలగించాడని పెద్ద పంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన పారిశుధ్య కార్మికులు చెంగల్రాయులు, రెడ్డెప్ప ఫిర్యాదు చేశారు. ఎనిమిదేళ్లుగా పనిచేస్తుంటే, రెండేళ్ల నుంచి జీతాలు ఇవ్వలేదని చెప్పారు.
- మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, గౌరవాధ్యక్షుడు గంగరాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. ప్రభుత్వం న్యాయం చేయకుంటే వచ్చే నెల 10 చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



అంగన్వాడీల నిరసన

పోలీసు కార్యాలయానికి 33 అర్జీలు



జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 33 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. సత్వర న్యాయం జరగడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు ఎస్పీ హామీ ఇచ్చారు. భూ తగాదాలపై 11, డబ్బు తగాదాలపై 8, కుటుంబ తగాదాలపై 5, ఆస్తి తగాదాలపై 3, దారి సమస్యలపై 2, ఇంటి తగాదాలపై 2, చీటింగ్, వేధింపులపై ఒక్కో అర్జీ వంతున అందాయి.

రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

● కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఇటీవల నిర్వహించిన రెవిన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై రెవిన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి జేసీ విద్యాధరితో కలసి వివిధ రెవిన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవిన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై ఆర్డీవోలు, తహసీల్దార్లు దృష్టిపెట్టాలన్నారు. ప్రతి అర్జీకి ఇచ్చిన ఎండార్స్‌మెంట్ల ఆడిట్ జరుగుతోందని, మండలాల్లో పర్యటించినప్పుడు ఎండార్సుమెంట్లను ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. రీఓపెన్‌కు అవకాశం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. మార్చి 8వ తేదీలోగా ప్రణాళిక ప్రకారం అర్జీలు పరిష్కరించాలన్నారు. ఇంటి పట్టాలకోసం దరఖాస్తు చేసుకున్నవారికి అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం తర్వాత పట్టాలు అందిస్తామన్నారు. ఫైల్స్ పెండెన్సీ లేకుండా పనిచేయాలని, మీ-సేవ ద్వారా అందే ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు, ఆర్వోఆర్, మ్యూటేషన్స్, 22-ఏ ఫైళ్ళను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడి పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే పరిష్కరించాలన్నారు.

పరీక్షలకు పక్కా ప్రణాళికతో సిద్ధంకండి

విద్యార్థులకు విశ్రాంత ఐఏఎస్ అధికారి సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న చెల్లప్ప

నగరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పరీక్షలకు పక్కా ప్రణాళికతో సిద్ధం కావాలని విద్యార్థులకు విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్.చెల్లప్ప సూచించారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలన్న అంశంపై సోమవారం వివరించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధ్యాపకుడిగా, ఆచార్యుడిగా, విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, జిల్లా కలెక్టర్‌గా, ఎస్సీ,ఎస్టీ కమిషన్ సెక్రటరీగా పనిచేసిన చెల్లప్ప ఇప్పటికీ వెనుకబడిన వారికి ఆర్థికసాయం, విద్యార్థులకు ప్రోత్సాహకం అందిస్తున్నారని ప్రశంసించారు.

1150 గ్రాముల గంజాయి స్వాధీనం

ముగ్గురు తమిళనాడువాసుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

నగరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని నాగరాజకుప్పం సమీపంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు తమిళనాడువాసులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ మహేశ్వర్ మీడియాకు సోమవారం వివరాలు తెలిపారు. ఎస్పీ, నగరి డీఎస్పీ ఆదేశాలతో నగరి పోలీసులు, డిప్యూటీ తహసీల్దారు ధనంజయలు నిర్వహించిన దాడిలో గంజాయి తరలిస్తుండగా తిరుత్తణికి చెందిన కిశోర్(25), తిరువళ్లూరు జిల్లాకు చెందిన తిరునింద్రవూరు వాసి మణిగండన్, అరక్కోణం తాలూకాకు చెందిన కుంబినిపేట నివాసి మునస్వామి(20)లను పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను కోర్టు ఎదుట హాజరుపరచగా.. 15 రోజులపాటు కస్టడీ విధించినట్లు సీఐ తెలిపారు.

ఆవును కాపాడబోయి చెరువులో మునిగిపోయాడు!



లోకనాథనాయుడి మృతదేహం

తవణంపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆవును రక్షించడానికి వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తవణంపల్లె మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణమనాయుడు కుమారుడు లోకనాథనాయుడు(46) తన పాడి ఆవును కడగడానికి గ్రామ సమీపంలోని కోడమ్మనాయుడు చెరువుకు తీసుకెళ్లాడు. ఆవును కడుగుతుండగా చెరువు లోపలికి వెళ్లిపోవడంతో కంగారుపడ్డ లోకనాథనాయుడు దానివెంట లోపలికి వెళ్లి మునిగిపోయాడు. కాసేపటికి ఆవు క్షేమంగా బయటకొచ్చేయగా రక్షించడానికెళ్లిన యజమాని చెరువులో మునిగి మృతి చెందాడు. చిత్తూరు అగ్నిమాపకశాఖ సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. లోకనాథ నాయుడి భార్య వరకుమారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా వర్శిటీలో ఇండోర్ స్టేడియం

రేపు ప్రారంభించనున్న మంత్రి లోకేశ్

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.5.75 కోట్లతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను బుధవారం ప్రారంభించనున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, మహిళా వర్సిటీ వీసీ వీ ఉమ, రిజిస్ట్రార్ ఎన్.రజని, పీఈడీ ఎస్.సరోజని, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ నేత మహేష్ యాదవ్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆ రోజున బాలబాలికలతో క్విజ్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎంకు వెటర్నరీ విద్యార్థుల వినతి



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటను వచ్చిన సీఎం చంద్రబాబుకు సోమవారం సాయంత్రం ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు. ఎయిర్‌పోర్ట్‌లో కలసి వైద్య విద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచాలని విన్నవించారు.

టీవీసీసీ సేవలను అడ్డుకున్న వెటర్నరీ విద్యార్థులు

వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారమూ కొనసాగింది. ఇందులో భాగంగా తారకరామ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ (టీవీసీసీ) వద్దకు చేరుకుని వైద్యసేవలను అడ్డుకున్నారు. క్లినికల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపీ సేవలను నిలిపివేశారు. ఎమర్జెన్సీ సేవలకు మాత్రమే అనుమతిచ్చారు. విద్యార్థులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను కూడా అడ్డుకుంటామని హెచ్చరించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, అమరనాథరెడ్డి, భానుప్రకాష్, మురళీమోహన్, థామస్, సీఎంకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న టీటీడీ ఈవో శ్యామల రావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

ముఖ్యమంత్రికి సాదర స్వాగతం

పలమనేరు/చిత్తూరు సిటీ/నగరి, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో సోమవారం సాయంత్రం ప్రారంభమైన అంతర్జాతీయ ఆలయాల సదస్సుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేణిగుంటలోని విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది.చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి,పులివర్తి నాని,గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, వీఎం థామస్, మురళీమోహన్,ఆదిమూలం,శాప్ ఛైర్మన్ రవి నాయుడు, టీటీడీ ఈవో శ్యామల రావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోండి

ఎంపీడీవోలకు కలెక్టర్ ఆదేశాలు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుకలెక్టరేట్,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీడీవోలను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి ఎంపీడీవోలు, కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఈవోపీఆర్డీలతో తాగునీటి ఎద్దడిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలో బోర్‌వెల్, పంపుసెట్ల రిపేర్లు, డీపనింగ్, ఇది వరకే గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్న వైనం, టైఅప్ వివరాలపై దృష్టి పెట్టాలన్నారు. వేసవిలో కలుషిత నీటితో ఎక్కువగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. రక్షిత మంచి నీటి ట్యాంకులను నెలకోసారి శుభ్రం చేయాలని సూచించారు. అవసరమైన చోట్ల గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నరేంద్ర కుమార్, డీఎల్‌డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న త్రివేణి సంగమం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భో.. శంభో అంటూ సాగిన భరతనాట్య ప్రదర్శన ఆద్యంతమూ ఆహూతులను కట్టి పడేసింది. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ - 381వ కార్యక్రమంతో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సోమవారం సాయంత్రం భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. అమెరికాలోని శాక్రమెంటో నగరానికి చెందిన కళాధర సంస్థకు చెందిన మధురా విశ్వనాథన్ బృందం ఈ ప్రదర్శన నిర్వహించింది. కుంభమేళా నేపథ్యంలో త్రివేణి సంగమం పేరుతో ఈ భరతనాట్య ప్రదర్శన రెండు గంటలపాటు సాగింది. వేద విశ్వవిద్యాలయ వీసీ రాణీసదాశివమూర్తి,సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి పాండ్ర సురేంద్రనాయుడు,శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, టీటీడీ ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణశర్మ తదితరులు మాట్లాడుతూ గంగా యమునా సరస్వతుల సంగమ త్రివేణి కుంభమేళా గురించి శాస్త్రీయంగా, ఆధ్యాత్మికంగా వివరణ ఇస్తూ భరతనాట్య ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాధర్ బృందం గురువు మధుర విశ్వనాథన్ సైతం అద్వితీయ భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులను సత్కరించారు.

తిరుపతిలో ముగిసిన తెలుగు వికీపీడియా పండగ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా మూడు రోజులపాటు జరిగిన తెలుగు వికీపీడియా పండగ ముగిసింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 50 మంది ప్రతినిధులు ఈ పండగలో పాల్గొన్నారు. 2003లో ప్రారంభమైన తెలుగు వికీపీడియా, లక్షకు పైగా వ్యాసాలతో విస్తరించిందని సదస్సులో వక్తలు తెలిపారు. తెలుగు వికీపీడియాను విస్తరించే మార్గాలు, వికీపీడియా రచయితల్లో రచనా నైపుణ్యాన్ని పెంపొందించడం, వికీపీడియా వ్యాసాలను ప్రజలకు మరింత విస్తరించడం వంటి కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. అలాగే తెలుగు వికీపీడియాలో చేరండి - విజ్ఞానాన్ని అందరికీ పంచండి' అంటూ తిరుపతి వీధుల్లో వికీపీడియా సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. దశాబ్ద కాలంగా వికీపీడియాకు విశేష సేవలు అందించిన వారిని ఈ సందర్భంగా సత్కరించారు. వీరిలో ఎర్రా రామారావు, ఎన్ఆర్ గుళ్లపల్లి, శ్రీరామమూర్తి, బత్తిని వినయ్‌కుమార్‌గౌడ్, స్వరలాసిక, టి.సుజాత, రవిచంద్ర, రామేశం తదితరులున్నారు.




గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద.. ఎట్టేరి బస్టాప్‌కూడలిలో పొగమంచు



రాణాచెక్‌పోస్ట్ మలుపులో.. 100 గొల్లపల్లె జైన్ ఫ్యాక్టరీ వద్ద ఎండ కారణంగా బోసిపోయిన రహదారులు

పొగమంచు.. ఎండ

ఉక్కిరిబిక్కిరవుతున్న జనం



రోజూ తెల్లవారు జామున పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 7.30 గంటల వరకు వీడటం లేదు. మరోవైపు ఉదయం 10.30 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత ఉంటోంది. మంచు కారణంగా చలితో.. ఎండ కారణంగా వేడికి జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

- గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి

గొల్లపల్లి గంగమ్మ సేవలో అమరనాథరెడ్డి



గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయతీ గొల్లపల్లి గంగమ్మ జాతరలో సోమవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. జాతర నిర్వాహకులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో సన్మానించి ప్రసాదాలను అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షులు నాగరాజరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు వెంకటమునిరెడ్డి, నాయకులు గణేష్, వెంకటరత్నం, జగదీష్‌నాయుడు, సెల్వరాజ్, నరేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి డైపర్ల పంపిణీ



సిబ్బందికి డైపర్లు అందజేస్తున్న సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు

పలమనేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రికి సోమవారం స్థానిక సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు రోగుల కోసం డైపర్లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆసుపత్రి ఆర్ఎంవో శారద, ఏవో లావణ్య, ఫార్మసిస్టు బేగం, మాధవీలత దాతను అభినందించారు.

విద్యార్థులకు సీఏ పుస్తకాల వితరణ



దాత నుంచి సీఏ పుస్తకాలను స్వీకరిస్తున్న విద్యార్థులు

కుప్పం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ కొమ్మినేని కుషాల్ సుమారు రూ.లక్ష విలువైన సీఏ పుస్తకాలను స్థానిక ప్రభుత్వ కళాశాల గ్రంథాలయానికి సోమవారం వితరణ చేశారు. అనంతరం సీఏ కోర్సుపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో సమయ పాలన పాటిస్తూ కష్టపడి చదివితే సీఏ కోర్సు విజయవంతంగా పూర్తి చేయొచ్చన్నారు. కార్యక్రమంలో సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు మాట్లాడుతూ యువ చార్టెడ్ అకౌంటెంట్ కుషాల్ స్థానిక ఆర్టీసీ డ్రైవర్ బలరామ్ కుమారుడన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి స్వరణ్, కార్తీక్, త్రివిక్రమ్ కుమార్, ఆర్టీసీ కార్మిక నాయకుడు బలరామ్, ఆర్‌సీ.రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ఘన జీవామృతం తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎం చంద్రమోహన్ తెలిపారు. పులిచెర్ల స్త్రీ శక్తి కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. సాధారణ వ్యవసాయంలో పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. మహిళలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఘనజీవామృతం తయారీ విధానాన్ని చూపారు. సీసీ తేజోవతి, పీఆర్‌పీ రమేష్, మునిచంద్ర, ఐసీఆర్‌పీ మల్లీశ్వరి, శ్రీహరి, భార్గవి, పద్మజ, గిరిజ, చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రాజేశ్వరిదేవి


చౌడేపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిత ఉంటుందని సీడీపీవో రాజేశ్వరి దేవి సూచించారు. సోమవారం స్థానిక హైస్కూల్‌లో ఆమె విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో అమరజ్యోతి, సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన, హెచ్ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యేనా.!

- స్థానికులు, అధికార పార్టీ నేతల వ్యతిరేకత
- నిధుల కొరత
- కూల్చివేత పరిధిలోకి 65 భవనాలు

'తొందర పడితే కాదు. గతంలో 60 అడుగుల మేర విస్తరించడానికి అనువుగా మార్కింగ్ చేశాం. ఇప్పుడు 70 అడుగులు అంటున్నారు. మళ్లీ మార్కింగ్ చేయాలి. నెమ్మదిగా జరుగుతుంది. అయినా మూడో రీచ్ విస్తరణ పరిధిలోకి ఏకంగా 65 భవనాలు వస్తాయి. ఇందులో ముప్పావువంతు కమర్షియల్ బిల్డింగ్‌లే. ప్రభుత్వం వద్ద పరిహారం చెల్లించడానికి ఫండ్స్ ఎక్కడున్నాయి?' ఒక ప్రభుత్వ అధికారి వ్యాఖ్య ఇది.

'ఇప్పట్లో రోడ్డు వెడల్పు చేయడం అయ్యే పనేనా? గతంలోనూ ఇలాగే హడావుడి చేసిన అధికారులు, బాధితులు కోర్టు గుమ్మం తొక్కడంతో చల్లబడిపోయింది ఎవరికి తెలియదు?' అధికార పార్టీ నేత ఒకరి వ్యాఖ్య ఇది.



కుప్పం పట్టణంలో మూడో రీచ్ పరిధిలోకి వచ్చే నేతాజీ రోడ్డు

కుప్పం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో నేతాజీ రోడ్డు మూడో రీచ్ విస్తరణ పనులకు అధికార పార్టీ నాయకులే అడ్డుపడుతున్నారా? అధికారులతో కలిసి తిరిగి సమ్మతి తెలిపిన నాయకులు తెర వెనుక స్థానికులను రెచ్చగొడుతున్నారా? విస్తరణ పరిధిలోకి వస్తున్న భవనాలు కూలగొట్టి నష్టపరిహారం చెల్లించడానికి నిధుల కొరత అడ్డంకిగా మారిందా? నిజానికి అధికార యంత్రాంగమే ఈ విషయంలో విముఖతతో ఉందా? అన్న ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానమే లభిస్తోంది. సుమారు 20 రోజుల క్రితం రోడ్డు విస్తరణ విషయంలో కడా అధికారులు చేసిన హడావుడి, ఆ తర్వాత ఏమాత్రం కనిపించకపోవడం వెనుక కారణం ఇదేనని స్పష్టమవుతోంది.

కుప్పంలో నేతాజీ రోడ్డు విస్తరణ మూడో రీచ్ పనుల విషయంలో తగని జాప్యం జరగడానికి వెనుక ఉన్న కారణాల్లో ఇవి మచ్చుకు రెండు మాత్రమే. 2014-2019లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మొదలైన రోడ్డు విస్తరణ పనులు రెండవ రీచ్ చివరికొచ్చేసరికి ఆగిపోయాయి. అప్పటికే ఎన్నో బాలారిష్టాలు దాటుకుని వచ్చిన విస్తరణ బాధితులు ఇద్దరు ముగ్గురు కోర్టుకు ఎక్కడంతో అనివార్యంగా ఆగిపోవాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు కనీసం ఈ విషయం తలిచేవారే లేకుండా పోయారు. మళ్లీ ఇన్నాళ్లకు టీడీపీ అధికారంలోకి వచ్చాక, రోడ్డు విస్తరణ పనులను తిరిగి ప్రారంభించాలని కడా అధికారులు నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా ముందస్తు కసరత్తు ఏమాత్రం లేకుండా గత నెల జనవరి 30వ తేదీన కడా పీడీ వికాస్ మర్మత్ కొంతమంది అధికారులను, అధికార పార్టీ నాయకులను వెంట వేసుకుని రోడ్డుపైకి వచ్చి రోడ్డు విస్తరణ మూడో రీచ్ పనులను మొదలు పెడతామంటూ కొంత హడావుడి చేశారు. వైసీపీ ప్రభుత్వం 2020 సెప్టెంబరు 8న విస్తరణ నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు పాపం, హడావుడి మధ్యలో మాత్రమే ఆయనకు తెలిసి హతాశులయ్యారు. ఆర్‌అండ్‌బీ అధికారులను అక్కడికక్కడే చీవాట్లు పెట్టి వెనక్కు వెళ్లిపోయారు. అంతే, మళ్లీ ఇంత వరకు ఎవరినుంచీ విస్తరణ ఊసు వినిపించడంలేదు.

● ఓట్ల రాజకీయమే అడ్డంకా?

నేతాజీ రోడ్డు విస్తరణ పనులను సౌలభ్యం కోసం మూడు రీచ్‌లుగా నాటి తెలుగుదేశం ప్రభుత్వం విభజించింది. ముప్పావువంతుపైగా ప్రభుత్వ స్థలాలే సేకరించడంతో మొదటి రీచ్ పనులకు ఏ అడ్డంకీ ఏర్పడలేదు. రెండో రీచ్‌కు వచ్చేసరికి ప్రైవేటు భవనాలు, స్థలాలు చాలా విస్తరణ పరిధిలోకి రావడంతో నత్తనడకన పనులు సాగాయి. చివర్లో కోర్టు కేసులతో పూర్తిగా ఆగిపోయాయి. ఇప్పుడు మూడో రీచ్ పరిధిలో ఇంకా ఎక్కువగా ప్రైవేటు భవనాలు పూర్తిగా కొన్ని, పాక్షికంగా కొన్ని పడగొట్టాల్సి ఉంటుంది. ఎమ్మార్ రెడ్డి సర్కిల్ నుంచి పాత రైల్వే గేటు వరకు సాగే ఈ మూడో రీచ్ పరిధిలో ఏకంగా 65 ప్రైవేటు భవనాలు, ఎక్కువగా కమర్షియల్ భవనాలు వస్తున్నాయి. వీరందరికీ కోట్ల రూపాయల్లో నష్టపరిహారం చెల్లించాల్సి రావడమే కాక అంతకుముందు తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికార, ప్రతిపక్షాలకు చెందిన పలువురు ప్రముఖుల భవనాలు ఇందులో ఉన్నాయి. అత్యధిక ధర పలుకుతున్న భవనాలను, స్థలాలను అతి తక్కువ లభించనున్న ప్రభుత్వ పరిహారం కోసం వదులుకోవడానికి వీరిలో ఎవరూ సిద్ధంగా లేరు. ప్రస్తుత అధికార పార్టీ అయిన టీడీపీ నాయకులు ఇప్పుడు ఓట్ల రాజకీయాన్ని తెరమీదికి తెస్తున్నారు. మూడో రీచ్ విస్తరణ పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రెండు, రెండున్నర వేల ఓట్లు ఉన్నాయని, అక్కడ చేయి పెడితే ఈ ఓట్లు మొత్తం వదులుకోవాల్సి ఉంటుందని వారు పార్టీ అధిష్ఠానాన్ని భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అధికారుల మాటలు విని, ఇక్కడ ఏమాత్రం చేయిపెట్టినా భవిష్యత్తులో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికల్లో సైతం పార్టీ విజయంపై ప్రభావం చూపుతుందని అంతర్గత చర్చల్లో హెచ్చరిస్తున్నారు. పాపం ఈ తెర వెనుక రాజకీయం, ఐఏఎస్ ఆఫీసర్ అయిన కడా పీడీ వికాస్ మర్మత్‌కు ఏం తెలుసు? మొన్న విస్తరణ పనులు ప్రారంభించడానికి సహకరించమంటూ ఆఫీస్ నుంచి కాల్ చేయించిన వెంటనే అధికార పార్టీ నాయకులందరూ కట్టకట్టుకుని దిగిపోయారు. అంతేకాదు, ఎప్పటినుంచో స్థానికంగానే పాతుకుపోయిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సైతం ఆయనకు సహకరించడానికి సిద్ధంగా లేనట్లే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో నేతాజీ రోడ్డు విస్తరణ పనులకు ఇంకా కొంతకాలంపాటు గ్రహణం తప్పేలా లేదు. ఈ గ్రహణం మున్సిపల్ ఎన్నికల వరకు అనివార్యంగా కొనసాగక తప్పదని అధికార పార్టీ నాయకులే చెబుతున్నారు.

పేదలందరికీ ఆరోగ్య సేవలు అందించాలి



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న జయరాముడు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలందరికీ ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా డీఈఎంవో జయరాముడు సూచించారు. సోమవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, ఎరిసరాల శుభ్రతను పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టరు వినయ్, డాక్టరు దినేష్‌కుమార్‌నాయక్‌లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. హెచ్‌ఈ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

కల్లూరులో 'ఆపరేషన్ డాగ్స్'

కల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మేజర్ పంచాయతీలో ఇటీవల కాలంలో వీధి కుక్కలు, కోతుల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం పంచాయతీ కార్యదర్శి నాగరాజు స్పందించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్లూరులో ఆపరేషన్ డాగ్స్ చేపట్టారు. పంచాయతీ పరిధిలోని అన్ని వీధులు, కాలనీల్లో తిరుగుతూ మొదటి రోజు 185 వీధి కుక్కలను పట్టుకొని సుదూర ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు. త్వరలో కోతులను పట్టించే కార్యక్రమం చేపడుతామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

రాయితీ రుణాలకు 147 దరఖాస్తులు

కల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో రాయితీ రుణాల కోసం 147 మంది నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తులు చేసుకున్నారని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిరుద్యోగులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు.

సీడీసీఏ లీడ్ మ్యాచ్‌కు పలమనేరు క్రీడాకారుల ఎంపిక



మ్యాచ్‌కు ఎంపికైన క్రీడాకారులతో బాలాజీ

పలమనేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సీడీసీఏ లీడ్ మ్యాచ్‌కు తిరుపతిలో నిర్వహించిన క్రీడాకారుల ఎంపికలో పలమనేరుకు చెందిన ఆరుగురు ఎంపికయ్యారని కోచ్ బాలాజీ తెలిపారు. పలమనేరు నుంచి బాయ్స్ ఆఫ్ బాలు అకాడమి నుంచి వెళ్లిన ఈశ్వర్, ఇమ్రాన్, హేమంత్, సాయి, జయ, రాకేష్‌లు ఎంపికయ్యారు.

మైనారిటీ నాయకుడు సద్దాంహుస్సేన్‌కు చల్లా పరామర్శ



సద్దాంహుస్సేన్‌ను పరామర్శిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనారిటీ నాయకుడు సద్దాం హుస్సేన్ తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సోమవారం పరామర్శించారు. పట్టణంలోని రాంనగర్‌లో కాపురం ఉన్న ఆయన ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీసుగిరి, సుహేల్‌బాషా, నదీం పగడాల రమణ, శంకర్ తదితరులు ఉన్నారు.

25న వాహనాల బహిరంగ వేలం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనాలను వేలంలో కొనుగోలు చేయదలచిన వారు ఆధార్ కార్డుతో పాటు ముందుగా రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

- కడా పీడీ వికాస్ మర్మత్



ప్రజల నుంచి సమస్యలు వింటున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యంత్రాంగం ఉన్నది ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పం మండల సచివాలయంలో ఆయన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు ఇచ్చి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఆయా సమస్యలను ప్రజల నుంచి విన్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ అభివృద్ధితోపాటు వివిధ రకాలుగా ప్రజలకు వినియోగపడటమే అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల సమస్యలు సావధానంగా విని, పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళితుల పట్ల అధికారులు వివక్ష మానుకోవాలి

● దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దళితులపై అధికారులకు వివక్ష తగదని.. దళిత మహిళపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండు చేశారు. సోమవారం పుంగనూరు- మదనపల్లె రోడ్డుపై బాధితురాలు చిన్నమ్మతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్నాలో దళిత సంఘ నాయకులు మాట్లాడుతూ గత నెలలో మండలంలోని మేకనజామనపల్లెకు చెందిన రాజానాయుడు మేలుందొడ్డికి చెందిన చిన్నమ్మ పొలంలోకి పశువులు వదలడమే కాకుండా ఆమెపై దాడి చేసి గాయపరిచారన్నారు. దాడికి పాల్పడిన రాజా నాయుడును అరెస్టు చేయకపోవడానికి కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసినా ఇప్పటి వరకు విచారణ జరగలేదన్నారు. దళితులపై దాడులు జరిగిన పోలీసులు ఫిర్యాదులు తీసుకునే పరిస్థితుల్లో లేరని వాపోయారు. సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి శాంతింపజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, మహానంది, ఆనంద్, ఆంజిప్ప, రెడ్డెప్ప, శంకర్ ,శేషాద్రి, రామకృష్ణ, టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పథకంతో జీవనోపాధి



సోమలలో ర్యాలీ చేస్తున్న అధికారులు



చౌడేపల్లెలో ర్యాలీ

సోమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పథకంతో జీవనోపాధి పెంచుకోవచ్చని డ్వామా ఏపీడీ వెంకట్రామరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో వాటర్‌షెడ్ పథకంపై అవగాహన కల్పించారు. వాటర్‌షెడ్ పథకంతో వ్యవసాయ ఆధారిత జీవనోపాధులు, భూగర్భ జలాల సంరక్షణ, పచ్చదనం అభివృద్ధి చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, వైస్ ఎంపీపీ ప్రభాకర్, పీవో శోభారాణి, ఏపీవో దినకర్‌బాబు, వాటర్‌షెడ్ చైర్‌పర్సన్ సుమలత, సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ సావిత్రమ్మ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మదన్ మోహన్‌బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు హేమగిరి, టీడీపీ నాయకులు శివశంకర్, వరదం జనార్దన్, మహేంద్రబాబు, మల్లికార్జున, చాణుక్య, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● చౌడేపల్లె: నీటి కుంటలతో భూగర్భ జలం పెరుగుతుందని పీవో ధనంజయ వర్మ సూచించారు. సోమవారం గడ్డంవారిపల్లెలో మైక్రో వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ పరిధిలోని లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్ చంద్రశేఖర్, ఏపీవో చిన్నరెడ్డమ్మ, టీఏలు ధనంజయుడు, నాయకులు వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఈడిగ సంఘం కృతజ్ఞతలు



సీఎంను కలిసిన ఈడిగ గౌడ సంఘం నేతలు

శాంతిపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమకు పది శాతం మద్యంషాపులు కేటాయించినందుకు ఈడిగ గౌడ సంఘం జిల్లా నేతలు సోమవారం తిరుపతిలో సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గీత కార్మికులను ఎల్లవేళలా అండగా నిలిచింది టీడీపీనేనని పేర్కొన్నారు. ఈడిగగౌడ సంఘం నేతలు నారాయణమూర్తి, త్యాగరాజు, శివశంకర్, మురుగేష్, పూర్ణ, మురళీ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు.

భవనంపై నుంచి జారిపడి పెయింటర్ మృతి




కుప్పం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో ఓ భవనంపై నుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. కుప్పం పట్టణంలోని ఓ వీధిలో నూతనంగా నిర్మాణమైన భవనానికి సోమవారం రంగులు వేయడానికి మురుగేశ్ అనే పెయింటర్ వెళ్లాడు. కుప్పం మండలం చందం గ్రామానికి చెందిన ఇతడు ఎత్తైన భవనానికి రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స కోసం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మురుగేశ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

మేలుపట్లలో ఇరువర్గాల గొడవలు

● పోలీసుల పికెటింగ్

పుంగనూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని మేలుపట్లలో రెండు వర్గాలు మధ్య గత కొన్నిరోజులుగా తలెత్తిన గొడవలు ఉద్రిక్తంగా మారుతాయనే అనుమానంతో పోలీసులు సోమవారం పికెటింగ్ ఏర్పాటు చేశారు. పుంగనూరు సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మేలుపట్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇరువర్గాలతో మాట్లాడుతున్నామన్నారు. ఘర్షణలు జరగకుండా పోలీసుల గస్తీ, పికెటింగ్‌తో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదులు చేసుకోగా గొడవకు కారణమైన కొంతమందిని గుర్తించి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయిస్తామని సీఐ తెలిపారు. ఈనెల 11, 12వ తేదీల్లో మేలుపట్లలో ఘనంగా గంగజాతర జరిగింది. ఈ జాతరలో ఇరువర్గాలకు చెందిన హరీష్, దిలీప్‌కుమార్ గొడవపడ్డారు. గురువారం సాయంత్రం అగ్రవర్ణానికి చెందిన హరీష్‌ను దళితుడు దిలీప్‌కుమార్ కొట్టడం ఏమిటని అగ్రవర్ణ కులస్తులు సుధాకర్, దొరబాబు, మహాలక్ష్మీ, హారతి, అరవింద్, హరీష్‌లతో పాటు మరికొంతమంది యువకులు కలిసి దిలీప్‌కుమార్ ఇంటిపైకి దాడి చేసి ఆమె తల్లి లావణ్యను గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు గుంపులు గుంపులుగా ఉండటంతో పోలీసులు చెదరగొట్టి తరిమేశారు. దళితులు తనపై దాడి చేశారని హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాలు గొడవలు చేసుకోకుండా బైండోవర్ కేసులు పెడుతున్నట్లు సీఐ తెలిపారు.

పుంగనూరు వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా శివశేఖర్



చౌడేపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షులుగా చౌడేపల్లె మండలానికి చెందిన తలారి శివశేఖర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు నియమించినట్లు ఆయన సోమవారం తెలిపారు. వాల్మీకి కుల అభివృద్ధికి తాను కృషి చేస్తానని పేర్కొన్నారు.

బాలిక మృతికి కారకులను అరెస్టు చేయాలి

పలమనేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలానికి చెందిన ఓ బాలిక మృతికి కారకులను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి సోమవారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. పదో తరగతి చదువుకునే బాలికకు మాయ మాటలు చెప్పి గర్భిణిని చేసి మృతికి కారకులు కావడం దారుణమని.. పోలీసులు వెంటనే కారకులను అరెస్టు చేయాలని కోరారు.

నాటు సారా విక్రేత అరెస్టు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సారా విక్రేతను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. నల్లగుట్లపల్లె తాండాకు చెందిన గిరిబాబునాయక్ నాటు సారా విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచడంతో 15 రోజులు రిమాండ్ విధించినట్లు వివరించారు.

జగన్ రెడ్డిది కపట ప్రేమ / మరమగ్గాల నిర్వాహకుల విమర్శ


మీడియాతో మాట్లాడుతున్న మరమగ్గాల నిర్వాహకులు

నగరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని మాజీ సీఎం జగన్ రెడ్డి ఇపుడు తమపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారని నగరి పట్టణంలోని మరమగ్గాల నిర్వాహకులు (మొదలియార్లు) విమర్శించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వారి మాటల్లోనే.. 'పక్క రాష్ట్రమైన తమిళనాడులో ఎప్పటినుంచో మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తుంటే.. మీ పాలనలో కనిపించలేదా? మీరు ఇబ్బడి, ముబ్బడిగా చేసిన అప్పులతో రాష్ట్ర ఖజానా సతమతమవుతోంది' అని మాజీ సీఎంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చెప్పిందే చేస్తుందని స్పష్టం చేశారు. శ్రీనివాస్, కరుణ, మదివాసన్, మాణిక్యవాసన్, రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


గోవిందస్వామికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చెంగమనాయుడు కండ్రిగలో గోవిందస్వామినాయుడికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ రూ.1,10,592ల సీఎం సహాయ నిధి చెక్కు సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు గాలి మురళీనాయుడు, రఘుపతినాయుడు, బాలాజి, బాలసుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గేటు వసూళ్లు తగ్గించండి / ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు వీధి విక్రయదారుల వినతి

నగరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమకు రోజువారీగా విధించే గేటు వసూళ్లను తగ్గించాలని వీధి విక్రయదారులు కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు రోజుకు మిగిలేదే రూ.500-600 అన్నారు. ఇందులో రోజూ రూ.300-400 వరకు గేటు వసూళ్లు చెల్లిస్తున్నామని, ఇది తమకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వేలం పాటలో మున్సిపల్ అధికారులు నిర్ణీత మొత్తాన్ని తగ్గించి.. పాట జరిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఐవో


ఇంటింటి తనిఖీలో డీఐవో హనుమంతరావు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీచవటపల్లె యూపీహెచ్‌సీని డీఐవో హనుమంతరావు సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతంలో ఏఎఫ్‌పీ(అక్యూట్ ఫ్లాస్సీ పెరాలసిస్) వ్యాధి లక్షణాలు కలిగిన బాలికను వైద్య సిబ్బంది గుర్తించారు. ఆ బాలికను పరిశీలించారు. శ్యాంపిల్స్ చెన్నైకి పంపించడం జరిగిందన్నారు. అనంతరం ఆ పరిసర ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. 15 ఏళ్లలోపు పిల్లలకు కొన్నిరకాల క్రోమోజోమ్స్ తగ్గిపోవడం వల్ల నోరు, మూతి వంకర పోయి పక్షవాత లక్షణాలు కనిపిస్తామన్నారు. ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు.

దుకాణాలు ఖాళీ చేయాలని ఆర్టీసీ అధికారుల ఒత్తిడి

● దంపతుల ఆరోపణ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దుకాణాలను ఖాళీ చేయాలని ఆర్టీసీ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని రామ్‌నగర్ కాలనీకి చెందిన ఇమామ్ దంపతులు ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 2021లో వన్ డిపో పరిధిలోని ఖాళీ స్థలాన్ని టెండర్ ద్వారా, అగ్రిమెంటు మేరకు రూ.2.50 లక్షలు ఆర్టీసీకి డిపాజిట్‌గా చెల్లించి దక్కించుకోవడం జరిగిందని చెప్పారు. ఈ స్థలంలో తమ సొంత డబ్బు రూ.25 లక్షల వెచ్చించి మూడు దుకాణాలు నిర్మించుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపారు. అగ్రిమెంటు కాలపరిమితి 2026 ఫిబ్రవరి నెలాఖరు వరకు ఉందన్నారు. తాను వైసీపీ కార్యకర్తననే ఉద్దేశంతో ఆర్టీసీ అధికారులు దుకాణాలు ఖాళీ చేయాలని వేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా, తమకు అనుకూలంగా ఆదేశాలు వచ్చాయని వివరించారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం



నగరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని పద్మావతీనగర్‌కు చెందిన తేజశ్వని(21)కి సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి.. తిరుపతి మెటర్నటీకి రెఫర్ చేశారు. దీంతో ఆమెను 108 వాహనంలో తిరుపతికి తీసుకెళుతున్నారు. తిరుపతి కలెక్టరేట్ సమీపానికి వచ్చేసరికి నొప్పులు ఎక్కువై 108 వాహనంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను మెటర్నటీ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 వాహన సిబ్బంది తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలి


బంగారుపాళ్యంలో కూరగాయల ప్రదర్శన

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని ప్రకృతి వ్యవసాయ మండల రిసోర్స్ పర్సన్ అంబికా గాంధీ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో వ్యవసాయశాఖ - రైతు సాధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన జరిగింది. కూరగాయలను అధికారులు, స్థానికులు కొనుగోలు చేశారు.

విజయపురం: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోనూ ప్రకృతి వ్యవసాయంతో పండిన అరటి, ముల్లంగి, వంగ, బీన్సు, తెల్ల ఉల్లిపాయలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రమేష్‌బాబు, ఫార్మర్ సైంటిస్ట్ రుక్మిణి, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించండి


డీపీటీవోకు వినతిపత్రమిస్తున్న సతీష్‌నాయుడు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రెండో డిపో నుంచి బస్సు సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వెదురుకుప్పం మండలం దేవళంపేటకు చెందిన తెలుగుయువత నేత సతీష్‌నాయుడు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ ఆదేశాలతో సోమవారం డీపీటీవో జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు ఇరవై సర్వీసులు వెదురుకుప్పం-దేవళంపేట మీదుగా, పెనుమూరు-వెదురుకుప్పం మీదుగా వివిధ సమయాల్లో ఆపేశారని చెప్పారు. అలాగే బెంగళూరు సర్వీసును పునరుద్ధరించాలని విన్నవించారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల నిరసన


కార్వేటినగరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమకు నెలసరి వేతనాన్ని రూ.20వేలకు పెంచాలని సోమవారం కార్వేటినగరంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) కార్వేటినగరం ఐసీడీఎస్ అధ్యక్షురాలు కె.విజయ, గౌరవ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, ప్రధాన కార్యదర్శి కె.మమత ప్రసంగించారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చి అమలు చేయాలన్నారు. ఈ మేరకు వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం మండలాల అంగన్వాడీలతో ర్యాలీ చేపట్టారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో చంద్రమౌళికి అందజేశారు.

బంగారుపాళ్యం: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘ నాయకులు సోమవారం సీడీపీవో వాణీప్రియకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీరాధిక, రత్నకుమారి, భారతి, వాసంతి, చంద్రకళ,హరిత,అనిత,హేమ, సుమంగళి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో తనిఖీలు


విద్యార్థినులతో మాట్లాడుతున్న భారతి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను సోమవారం జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్, వంట గదులను పరిశీలించారు. వంటలను రుచి చూసి.. విద్యార్థులతో కొంత సేపు ముచ్చటించారు.

మా అనుభవంలోని భూమిని ఇప్పించండి

లేదంటే తహసీల్దార్ కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకుంటా- వీడియోలో రాణావేణుగోపాలపురంవాసి

పెనుమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉన్న భూమిని ఇప్పించాలని రాణావేణుగోపాలపురానికి చెందిన సుబ్రహ్మణ్యం కోరారు. దీనిపై ఆయన విడుదల చేసిన వీడియో ఒకటి వైరల్‌గా మారింది. 'సర్వే నెంబరు 844-3లో 20 సెంట్ల ప్రభుత్వ భూమి వందేళ్లుగా మా ఆధీనంలో ఉంది. అందులో బోరు, ఇల్లు కట్టుకున్నాం. ఈ భూమికి ఇప్పుడు వేరొకరు పట్టా చేసుకున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదు. ఇల్లు, బోరున్న భూమిని నాకు అప్పగించాలి. లేదంటే తహసీల్దారు కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకుంటా' అని ఆయన వీడియోలో పేర్కొన్నాడు. ఈ విషయంపై తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. పీజీఆర్ఎస్‌లో అతను ఫిర్యాదు చేశాడని తమకు సమాచారం వచ్చిందన్నారు. అయితే వెబ్‌ల్యాండులో 2014 నుంచి విజయమ్మ పేరుతో పట్టా ఉందని తెలిపారు. మంగళవారం వీఆర్వో, సర్వేయర్‌లతో కలిసి వచ్చి పరిశీలిస్తామని ఫిర్యాదుదారుడితో చెప్పామన్నారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు.


వివరాలు తెలియజేస్తున్న సుబ్రహ్మణ్యం

గార్మెంట్స్ యూనిట్ ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే జగన్మోహన్


ఖైదుగానికండ్రిగ సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'గుడిపాల నా సొంత మండలం. దీన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం' అని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. 197 రామాపురంలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మండలంలో గార్మెంట్స్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. దీనిద్వారా మహిళలకు జీవనోపాధి కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. అనంతరం కొత్తకోట, సీఎం కొత్తయిండ్లు, వెంగమాంబపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, 197 రామాపురంలో ప్రహరీ, క్రిష్ణజిమ్మాపురం, గొల్లపల్లె, బందార్లపల్లె, రాగిమానిపట్టెడలో సీసీ రోడ్లు, కుప్పిగానిపల్లెలో గ్రామ సచివాలయం, మరకాలకుప్పం, గట్రాళ్ళమిట్ట, మండిక్రిష్ణాపురంలో సీసీ రోడ్లు.. మొత్తం రూ.1.44 కోట్లతో పనులను ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, బీజేపీ మండల అధ్యక్షురాలు రమాదేవి, జనసేన మండల అధ్యక్షుడు రూప్‌కుమార్, ఎంపీడీవో శివరాజ్, ఇన్‌చార్జి తహసీల్దార్ జయంతి, ఈఈ ప్రసాద్ నాయుడు, కూటమి నాయకులు బాలాజినాయుడు, సుమతి, అనిల్‌కుమార్, హరిబాబు నాయుడు, విజయ్‌నాయుడు, దామోదరం, బలరామ్, నాగరాజ్ యాదవ్, మురారి కన్నయ్య, హరి, గుర్రప్ప నాయుడు, జయదేవనాయుడు, విజయలక్ష్మి, చంద్రమోహన్, చంద్రన్, శేఖర్, దేవ, చందు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను తొలగించిన అధికారులు

పెనుమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చార్వాగానిపల్లె గ్రామంలోని సర్వే నెంబరు 42లో ఉన్న రోడ్డు పోరంబోకులో తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తమ సిబ్బంది, పోలీసులతో కలిసి ఆక్రమణలను తొలగించారు. ఇటీవల రెండువర్గాలు ఘర్షణపడి కేసులు నమోదు చేసుకున్నారు. పోరంబోకు భూమిలో ఒకరు పెంకుటిల్లు, మరొకరు ప్రహరీ నిర్మించారని గుర్తించి వాటిని తొలగించారు. అలాగే మరో ఇద్దరి నిర్మాణాలకు సంబంధించిన రికార్డులు తేవాలని, లేదంటే 15 రోజుల వ్యవధిలో వాటినీ తొలగిస్తామని సెక్షన్-7 నోటీసులు జారీ చేశారు.

పారిశుధ్య పనులపై దృష్టి పెట్టరా?

● సెక్రటరీలపై ఎంపీడీవో ఆగ్రహం

పెనుమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులపై దృష్టి పెడుతున్నారా లేదా? అంటూ సెక్రటరీలపై ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పారిశుధ్యం సరిగా లేదని కలెక్టర్ ఆగ్రహించిన విషయం తెలిసిందే. సోమవారం సెక్రటరీలతో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. 'అసలు విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారా లేదా.. మీ వల్ల నేను మాటలు పడాలా' అని ప్రశ్నించారు. వేసవికాలం వస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని చెప్పారు. ఈ వారంలో కలెక్టర్ పర్యటన ఉంటుందని.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సమన్వయంతో పనిచేద్దాం: ఎంపీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజుపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేసి, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ సరిత పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ఆర్‌పురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ సాయికుమార్ మాట్లాడుతూ.. పీఎం ఆవాస్ యోజన కింద అర్హులైనవారు నూతన గృహాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు అరికట్టడానికి కమిటీలు

పెనుమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో వినుతశ్రీ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మండల స్థాయి కమిటీలో చైర్మన్‌గా తహసీల్దారు, పంచాయతీ స్థాయిలో మహిళా పోలీసు చైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ తరగతుల కోసం పెనుమూరు హైస్కూల్‌లో భవనాలను పరిశీలించారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, డీటీ వాణి, సీహెచ్‌వో గోవిందయ్య, గాయత్రి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి


తవణంపల్లెలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న వేణుగోపాల్

తవణంపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్ సూచించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు మలేరియా నివారణాధికారి రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ అధికారి శివ సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



ఐరాల (కాణిపాకం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి గుడి పునర్నిర్మాణానికి సోమవారం భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు మణినాయుడు, మోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

హౌస్ సైట్ పట్టా రీవెరిఫికేషన్‌ను పక్కాగా చేయండి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇచ్చిన హౌస్ సైట్ పట్టా రీవెరిఫికేషన్‌ను పక్కాగా చేయాలని డీటీ, ఆర్ఐ, వీఆర్వోలను చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తన తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. వార్డు సచివాలయాల్లో ధ్రువీకరణ పత్రాలను పెండింగ్ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ధ్రువీకరణ పత్రాల దరఖాస్తుల కోసం తమ కార్యాలయంలో ఒక బాక్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్ఐ ఉన్నా లేకున్నా ఆ పెట్టెలో దరఖాస్తులు వేయొచ్చన్నారు. డీటీ నరేష్, ఈడీటీ హిమగిరి, ఆర్ఐ సంతోష్, సర్వేయర్ ఖుషేంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

'హంద్రీ-నీవాకు రూ.5వేల కోట్లు కేటాయించాలి'


కరపత్రాలను నీవా నదిలో ప్రదర్శిస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో హంద్రీ-నీవాకు రూ.5వేల కోట్లు కేటాయించాలని ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కడపలో జరిగే ప్రాజెక్టు మహాసభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం నీవానదిలో ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ.. చిత్తూరు నగరానికి హంద్రీ-నీవా ప్రాజెక్టు ఒక్కటే శరణ్యమన్నారు. రాయలసీమ నుంచి ఆరుగురు ముఖ్యమంత్రులు పరిపాలించినా చిత్తూరుకు తాగునీరు, సాగునీరు అందించడంలో విఫలమయ్యారన్నారు. ఈనెల 22 నుంచి కడపలో జరిగే ప్రాజెక్టుల మహాసభకు వందలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘ, సీపీఐ నాయకులు నాగరాజు, గోపీనాథ్, మణి, విజయ్‌కుమార్, విజయగౌరి, లత పాల్గొన్నారు.

అర్జీల పురోగతిపై కమిషనర్ సమీక్ష

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు గతవారం అందిన అర్జీలపై కమిషనర్ నరసింహ ప్రసాద్ సోమవారం సమీక్షించారు. అలాగే ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. రెవెన్యూకు 2, ఇంజనీరింగ్‌శాఖకు 2 చొప్పున అర్జీలు అందాయి. అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

డ్రైనేజి పనుల పరిశీలన

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం పంచాయతీలోని కండ్రిగ దళితవాడలో ఎంపీ నిధులు రూ.15లక్షలతో జరుగుతున్న డ్రైనేజి పనులను టీడీపీ నేతలతో కలిసి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు సోమవారం పరిశీలించారు. నేతలు స్వామిదాస్, నియాజ్‌అలీ, నీరజాక్షులురెడ్డి, జీవరత్నం, జ్యోతియాదవ్, కండిగ శంకర్, రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు / తయారీదారుల్లో ఒకరి అరెస్టు, పరారీలో ఇద్దరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న అధికారులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఈఎస్టీఎఫ్ దాడులు నిర్వహించింది. 'విచ్చలవిడిగా నాటుసారా తయారీ' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ఈఎస్టీఎఫ్, టాస్క్‌ఫోర్సు ఏఈఎస్ కృష్ణ కిషోర్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలతో ఇన్‌స్పెక్టరు కొత్తకోట మోహన్ తమ సిబ్బందితో సారా స్థావరాలపై దాడులు చేశారు. వెదురుకుప్పం మండలం కురివికుప్పం అటవీ ప్రాంతాల్లో దాడులు చేసి, 450 లీటర్ల సారా ఊట ధ్వంసం చేశారు. సారా తయారీ చేస్తున్న కురికుప్పంవాసి రవిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. అతడి వద్ద నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వెదురుకుప్పం మండలం ధర్మాచెరువుకు చెందిన చెంగయ్య కుమారుడు వెంకటేష్(26), వెంకటయ్య కుమారుడు వై.సుబ్రహ్మణ్యం(54) పరారయ్యారు. అలాగే కురివికుప్పం సమీపంలో మరో 500 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి, కేసు నమోదు చేశారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు పుతిలీబాయ్, వెంకటాచలపతి, వెంకటేష్, గాయత్రి పాల్గొన్నారు.

కఠిన చర్యలు: సీఐ, ఎస్ఐ

పాలసముద్రం: సారా తయారీ, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ చినరెడ్డెప్ప అన్నారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో మండలంలోని సారా తయారీదారులను స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీచేశారు. సారా తయారీ, విక్రయాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

సంక్షిప్తంగా..

డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే-2025 డైరీని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తామెదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథన్, మురళీ కృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు శివకుమార్, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు పవన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యంత్రాల పంపిణీ

పెనుమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగురు రైతులకు సబ్సిడీతో చాప్‌కటర్ల(గడ్డికోసే యంత్రాలు)ను సోమవారం పశువైద్యశాలలో పంపిణీ చేశారు. ఈ యంత్రం ఖరీదు రూ.33 వేలు ఉండగా సబ్సిడీపోను రూ.20,400కి రైతులకు అందించారు. మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు, పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


రేపు చెరువులకు వేలంపాట

నింద్ర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12చెరువులకు బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నారు. సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అడవికి నిప్పంటిస్తే జైలుకే

గుడిపాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అడవులకు నిప్పంటిస్తే జైలుకెళ్తారని బొమ్మసముద్రం బీట్ అధికారి ప్రభాకర్ రెడ్డి, పశ్చిమ అధికారి ఉష అన్నారు. సోమవారం బొమ్మసముద్రం ఎస్టీకాలనీలో అడవికి నిప్పుపెట్టడం వలన జరిగే నష్టాలగురించి స్థానికులకు వివరించారు. ఫారెస్టుఅధికారి మధు పాల్గొన్నారు.

సింహవాహనంపై చిదంబరేశ్వరుడు



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఉత్సవ నిర్వాహకుడు డి.కృష్ణమూర్తి, అర్చకులు మహేష్, ఉమేష్, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను విడుదల చేయండి: గ్రీన్ అంబాసిడర్లు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని గ్రీన్ అంబాసిడర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పుల్లూరు క్రాస్ రోడ్డులో రెండో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 21వతేదీన ఎస్ఆర్‌పురం మండలంలో జరిగే రెండో మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన, కార్మికులు మునెయ్య, ఆర్పుదం, దీప, ముంజుల, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

విజయపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): క్షూరికాపురం పంచాయతీ మహావీరపురం అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి భవానిశంకరి తనిఖీ చేశారు. తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దిగువ మంగుంట గ్రామంలోని రుక్మిణి సత్యభామ శ్రీకృష్ణ ఆలయ మహా కుంభాభిషేకాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు.జీడీనెల్లూరు తెలుగు యువత అధ్యక్షుడు కిషాన్ చంద్ (ఎన్ఆర్ఐ), వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. టీడీపీ నేతలు చంద్రబాబురెడ్డి, హిమచలపతిరెడ్డి, మధు, జనసేన నాయకులు చందు, మురళి పాల్గొన్నారు.


పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న కిషన్‌చంద్